


# ఫ్లవర్

**శంకరమంచి పార్థసారధి**

అదొక అందమైన నగరం...

అక్కడ సామాన్య మనిషి సణుగుతూ. సతమతవౌతూ వచ్చినట్లుగా బ్రతుకుతుంటాడు.

అది మిక్కిలి ఖరీదైన నగరం కూడా...

ఎన్నికలప్పుడు ఓటెయ్యడానికి తప్ప మరెందుకు పనికిరాని వాళ్ళు, పట్టుచీరెల మీది ప్రాకే గొంగళీపురుగుల్లాంటి వాళ్ళు అక్కడ కొల్లలు. ఆ నగరంలోని రోడ్లు ఎప్పుడూ అద్దాల్లాగా తళతళలాడుతుంటాయి. ఇప్పుడిప్పుడే తలెత్తుతున్న ఆకాశహర్మ్యాలు వయస్సు వచ్చిన కలవారి ఆడబడుచుల్లాగా అందంగా, ఆకర్షణీయంగా, నాగరికతా చిహ్నాలుగా కన్పిస్తాయ్. కార్లలోను, స్కూటర్సు పైన తిరిగే వారిని చూసిన కంటితో, నెలలు నిండిన గర్భిణీ స్త్రీలా వుండే సిటీ బస్సులని చూస్తే, మనిషి ఎలా బ్రతకాలో, ఎలా బ్రతక్కూడదో వుదహరించి, దృశ్యరూపంలో చూపిస్తున్నట్లుగా వుంటుంది. నగరమంతా కుక్క గొడుగుల్లాగా తలెత్తుతున్న స్టార్ హోటల్సు విలాసాలకి ఆటకొమ్మలై విలసిల్లుతుంటాయ్.

అటువంటి స్టార్ హోటల్సులో అతి ముఖ్యమైన, అంతకన్నా ఖరీదైన ఒక హోటల్ ప్రాంగణం అది. ఆ రోజక్కడ చాలా సందడిగా వుంది. వచ్చేపోయే పడవకార్లు, వాటిల్లోంచి దిగుమతి అవుతున్న ఖరీదైన మనుషులు, పట్టుచీరెల గరగరలు, వివిధ భాషా సంభాషణా ధ్వనులు. పచ్చనోట్ల ఆప్యాయత నిండిన పరిచయ పలకరింపులు, గుభాళిస్తున్న రకరకాల సెంటు వాసనలు. అవును అక్కడెంతో సందడిగా వుంది

ఏమీ తెలీని వ్యక్తి ఆ సందడిని, ఆర్భాటాన్ని చూసి, షష్ఠి పూర్తి చేసుకున్న సినిమా హీరో కూతురి పెళ్ళో, లేక ముప్పై ఏళ్ళుగా ప్రజాసేవ చేసుకుంటున్న మంత్రివర్యుల కుమారుడి పెళ్ళోని అపార్థం చేసుకునేందుకు సరిపోయేటంత హంగామా, ఆర్భాటం వుందక్కడ. కానీ నిజానికి అక్కడ ఎవరి పెళ్ళి జరుగబోవటం లేదు. కేవలం 'రోజ్ ఎగ్జిబిషన్' — గులాబీ పూల ప్రదర్శన మరియు పోటీ జరుగుతోంది. ఆ విధంగా ప్రతిసంవత్సరం పోటీలు నిర్వహింపబడతాయని కడుపులు కాలే వాళ్ళకి తెలీదేమోగాని, ఎప్పుడూ కడుపునిండుగా వుండే అజీర్తి రోగులందరికీ తెల్సును. తెల్సుకనుకనే అంతటి సందడి, ఆర్భాటం.

ఆ నగరంలో 'రోజ్ సొసైటీ' అని ఒక సంస్థ వుందని, దానిలో బాగా డబ్బు (ఎలా సంపాదించినదైనా ఫర్వాలేదు) తిరుబడి, పలుకుబడి (ఎటువంటిదైనా సరే) వున్నవాళ్ళంతా సభ్యులని, అసలా సంఘంలో సభ్యత్వం వుంటే తప్ప తమ హోదాకి రాణింపు లేదని చాలా మంది అనుకుంటారని ఎంతోమందికి తెలీకపోవటం పెద్ద ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. ఆ రోజ్ సొసైటీ ప్రతిసంవత్సరం ఇదే విధంగా పోటీలు ఏర్పాటు చేసి, 'బెస్ట్ రోజ్' ని ఎన్నిక చేయించి, దాని యజమానికి (ఆ పూమాలికి) ఘనమైన బహుమతి నందిస్తారన్న విషయం కూడా చాలా మందికి తెలీదు.

అంతటి మహత్తరమైన, గొప్ప చరిత్ర కల్గిన ఆ రోజ్ సొసైటీకి కార్యదర్శి కిషన్‌రావు. అతడు ఎర్రగా వుంటాడు. మొహం విశాలంగాను, జుట్టు పల్చగాను వుంటుంది. పిల్లి కళ్ళు చప్పిడి ముక్కు, తాంబూల సేవనంలో ఎప్పుడూ ఎర్రగా మందార చెక్కల్లా కన్పించే పెదవులు— అన్నిటిని కలబోసి చూస్తే సర్కస్‌లో బఫూన్ని స్ఫురణకి తెచ్చేలా వుంటాడు.

కానీ—

అతడి మెళ్ళో తళుక్కుమంటున్న జిగినీ గొలుసుని, నాలుగు వేళ్ళకి కన్పించే వుంగరాలని, గోల్డ్‌చైన్ వాచీని, ధరించిన ఖరీదైన సఫారీ సూటుని చూసేక, అతడిపై ఎనలేని భక్తి ప్రపత్తులేర్పడతాయి — భౌతికవాదులకి.

అతడారోజు చాలా సందడిగా తిరుగుతున్నాడు. కార్లలో వస్తున్న వాళ్ళని సాదరంగా ఆహ్వానించి ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డ షామియానాల్లో కూర్చుండబెడుతున్నాడు. క్రిందివాళ్ళకి పన్లు పురమాయిస్తూ, ముతక బట్టల్లో వున్నవాళ్లని ప్రక్కకి తప్పుకోండని విసుక్కుంటూ, ఎక్కడ చూసినా అతడే కన్పించి తన కూతురి పెళ్ళి చేస్తున్నవాడిలా కంగారుపడిపోతున్నాడు.

అతడావిధంగా కంగారు పడటానికో కారణం వుంది. కేవలం రోజ్ సొసైటీ కార్యదర్శిగా, పోటీ సరిగ్గా సవ్యంగా జరుగని పక్షంలో తనకి, సొసైటీకి చెడ్డపేరు వస్తుందని గాని. లేక గళంలేని వూర్వశిల్లాంటి గులాబీల సౌందర్యానికి ముగ్ధుడయ్యిగాని — కాదు.

ఆ రోజు పోటీకి న్యాయనిర్ణేతగా నియమించబడ్డ కుమారి హేమసుందరి తండ్రితో అతడికి వ్యాపారసంబంధమైన ముఖ్యమైన పనుంది. కాబట్టే తన చాకచక్యంతో, ఆర్భాటంతో ఆమెనెంతో ముగ్ధురాలిని చేయగలిగి, మెప్పించగలిగితే, అతడి పని అంత సులభంగా నెరవేరుతుంది.

అందువల్ల అతడా రోజు చాలా ఆందోళనగాను, ఆదుర్దాగాను వున్నాడు.

హేమసుందరికి ఇరవై నాలుగు సంవత్సరాలకి అటూ ఇటుగా వుంటుంది. ఎర్రగా సన్నగా మెరుగుపెట్టిన బంగారు తీగెలాగా వుంటుంది. కోలమొహం, ఎర్రటి చెక్కిళ్ళు, చిన్ని పెదవులు, సన్నటి నడుం, రెచ్చగొట్టేట్టుండే ఆడతనపు పొంగులు, గర్వంగా మెరిసే కళ్ళతో, పురాణాల్లో విన్పించే రంభ వూర్వశి లనబడే పదాలకి రూపకల్పన చేస్తున్నట్లుగా వుంటుంది. అంతటి అందం సిరిగల వాళ్ళింట్లో వుండటం చాలా సమంజసంగాను, సబబుగాను అన్పిస్తుంది ఆమెని చూసిన వాళ్ళకి.

ఆమె తండ్రి శ్యామలరావు. అతడికి లేని వ్యాపారమంటూ లేదు. అన్ని రంగాల్లోను అతడున్నాడు. అతడి వెంట అదృష్టం వుంది. అందువల్ల చిన్నగా మొలకెత్తిన అతడి జీవితం అతిస్వల్ప కాలంలోనే మొక్కగా మెరిగి, పెద్ద వృక్షంగా మారి, వూడల్లాంటి శాఖలతో అన్ని చోట్లకి విస్తరించి, పెద్దవాళ్ళ జాబితాలో మొదటివాడుగా పరిగణింపబడి, 'రోజ్ సొసైటీ' కి పర్మనెంటు సభ్యుడయ్యేటంతగా ఎదిగిపోయాడు..

అసలు కిషన్‌రావు మొదట శ్యామలరావును జడ్జీగా ఆహ్వానించాలని ప్రయత్నించి కుదరక నిరాశ చెందేడు. పోటీ రోజుకి తాను నగరంలో వుండనని శ్యామలరావు చెప్పినప్పుడు, అతడి పథకాలన్నీ తారుమారయినట్లుగా వెర్రిగా చూస్తున్నపుడు, అదే సమయానికి హేమసుందరి కార్లోంచి దిగటము, తండ్రికి విష్ చేసి అందంగా కదలి వెళ్ళటం కంటబడ్డ కిషన్‌రావుకి వాడిపోయిన ఆశల గులాబీ తిరిగి వికసించినట్లనిపించింది. వెంటనే ధైర్యం చేసి లౌక్యంగా హేమసుందరిని జడ్జీగా పంపమని అడగటం, శ్యామలరావు కాస్సేపు వస్తాయించి, చివరికి సరేననటంతో గుడ్డిలో మెల్లగా సరిపెట్టుకుని తృప్తి పడ్డాడు. అందువల్లనే తన భవిష్యత్తు, భావి కార్యక్రమాలు ఆమె సంతృప్తి మెప్పుదలలపైనే వున్నట్లుగా ఆరాటపడిపోతున్నాడు.

అక్కడ హోటల్ ఆవరణలో రెండు పెద్ద పెద్ద షామియానాలను విడివిడిగా ఏర్పాటు చేసారు. ఒకదాంట్లో వచ్చిన ఆహ్వానితులని కూర్చుండబెట్టి, బిస్కెట్స్, టీ సర్వ్ చేసి, అప్పటివరకు రోజ్ సొసైటీ సాధించిన ప్రగతిని చాటి చెప్పే కరపత్రాలను పంచుతారు. ఇక రెండవ షామియానాలో వరుసగా డైనింగ్ టేబిల్సు లాంటి బల్లలు పరిచి, వాటిని తెల్లటి వస్త్రాలతో అలంకరించారు. ఆ విధంగా ఏర్పాటు చేసిన బల్ల మీద గులాబీ మొక్కలున్న పూలకుండీల నమర్చారు. ప్రతికుండీలో వున్న మొక్కకి

**ఎక్కడనుంచి వచ్చాడో ఎలా వచ్చాడో, ఎవ్వరికీ తెలీదు. అసలు ఎవ్వరూ గమనించలేదు కూడా. అక్కడికీ బయటనించి అలాంటి ఎడ్డిమొడ్డి జనం రాకుండా గట్టికాపలా కూడా ఏర్పాటు చేశాడు కిషన్‌రావ్.**

దిగువున చిన్నకార్డు, దానిపై యజమాని పేరు, అడ్రస్సు, ఆ గులాబీ యొక్క ఫ్యామిలీ వివరాలు టైపు చేయించబడి వుంటాయి. ఆ విధంగా రెండు మూడు వరుసలుగా టేబిల్సు అమర్చబడి వున్నాయి.

సాయంత్రమవటం చేతగాలి చల్లబడి, వాతావరణం ఆహ్లాదంగా వుంది. అప్పటికే చాలామంది సభ్యులు విచ్చేసి, ప్రక్కన షామియానాల్లో టీ త్రాగుతూ గొడవగా మాట్లాడు కుంటున్నారు. కిషన్‌రావు ఏర్పాట్లు పరిచూసికుని, తృప్తిగా తలపంకించి, ప్రక్కనే ఏర్పాటు చేసిన చిన్న వేదిక లాంటి దానిపైకెక్కి మైకులో 'ఆహ్వానితులైన గౌరవ సభ్యులకి రోజ్ సొసైటీ స్వాగతం. ఎక్కువ సంఖ్యలో సభ్యులు హాజరుకావటం మాకెంతో వుత్సాహంగాను, ధైర్యంగాను వుంది. ఈనాటి కార్యక్రమానికి ముఖ్యఅతిథి అయిన మిస్. హేమసుందరి, శ్యామలరావుగారి కుమార్తె, ఇక్కడికి రావటానికి కాస్త వ్యవధి వున్నట్టుగా ఇప్పుడే తెల్సింది. అప్పటివరకు గౌరవనీయులైన మా సభ్యులని లలితలావణ్య గులాబీల ముగ్ధమోహన సౌందర్యాలని తిలకించకుండా ఆపటం భావ్యం కాదని తలచి, ఎగ్జిబిషన్‌ని ప్రారంభిస్తున్నాం. కాని సభ్యులకి చిన్న విన్నపం — దయచేసి పూలని తాకవద్దు. దూరాన్నించే పరిశీలించి పరవశించమని ప్రార్థిస్తున్నాను. మీ అందరికిదే మా ఆహ్వానం' అంటూ హుందాగా చేతిని ప్రక్కనున్న షామియానా వైపుగా చూపేడు.

జనం బిలబిల గరగరమంటూ గుంపులు గుంపులుగా షామియానాలోకి చొరబడ్డారు. అప్పటివరకు ఖాళీగా వున్న ప్రదర్శనశాల ఒక్కసారిగా కోలాహలంతో నిండింది. చల్లబడ్డ గాలి, సెంటు వాసనతో కలిసి మత్తెక్కించేలా వుంది. అందరూ పూలని వరుసగా చూసుకుంటూ, మెల్లిమెల్లిగా మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

ఎన్నో రకాల గులాబీలు అక్కడమర్చబడున్నాయ్. అవలా పూలల్లో అన్ని రకాలుంటాయని గూడా చాలా మందికి తెలీదు. రకరకాల రంగుల్లో ముద్ద మందారాల్లాగా, వయస్సు వరదలొచ్చి పరవళ్ళు త్రొక్కుతున్న ఆడపిల్లల్లా, గాలికి సన్నగా కదులుతూ స్వాగతం చెపుతున్నట్టుగా అవిస్తున్నాయ్. ఒకదాతో ఒకటి పోటీ పడుతూ, అంతులేని అందంలాగా, భాష కందని అనుభూతి నందిస్తున్న ఆ పూలని అక్కడివాళ్ళందరూ ముగ్ధులై చూస్తుండగా—



వాడొచ్చాడు —

ఎక్కడినించి వచ్చాడో, ఎలా వచ్చాడో ఎవ్వరికీ తెలీదు. అసలు ఎవ్వరూ గమనించలేదు గూడా. అక్కడికి బయటినించి అలాంటి ఎడ్డిమొడ్డి జనం రాకుండా గట్టి కాపలా కూడా ఏర్పాటు చేసేడు కిషన్‌రావ్. అయినా ఎలా వచ్చేడో గాని, వాడొచ్చేడు.

వాడి పేరు నీలయ్య. పదేళ్ళ వయస్సుంటుంది. తైల సంస్కారం లేక ఎర్రబడ్డ జుట్టు, స్నానం లేక తెల్లబడ్డ వొళ్ళు, తిండిలేక లోపలికి తోసుకుపోయిన దవడలు, గుంటకళ్ళతో చూడటానికసహ్యంగాను, ఆలోచనకి దీనంగాను, పసితనంవల్ల అమాయకంగాను వున్నాడు. చిరిగిపోయిన చొక్కా నీతిలో పుట్టి అవి నీతిలో స్థిరపడ్డ సగటు మనిషిలా నల్లబడి, ఒకప్పటి తెల్లదనాన్ని మర్చిపోయింది.

ఎండిన డొక్కలపై నిలబడక జారిపోతున్న చినుగుల నిక్కరుని మాటిమాటికి పైకి లాక్కోవటం అలవాటయ్యి, అతడికది బ్రతుకులో ఒక భాగంగా మారింది.

వాడు జనంలోకి చొరబడి ఆశ్చర్యంగా ముందు

అక్కడున్న మనుషుల వంక, తర్వాత వాళ్ళు ఆశ్చర్యంగా తిలకిస్తున్న పూల వంక చూసేడు. వాడికి విచిత్ర ప్రపంచంలోకి, లేక గ్రహాంతారాల్లోకి ప్రయాణం చేసినట్లే అన్పించగా, రెప్పవెయ్యకుండా, వూపిరి తియ్యకుండా గమనించసాగేడు.

అప్పటికీ ఎవ్వరూ వాడిని గమనించలేదు.

నీలయ్య జనంతో పాటుగా కదిలి మెల్లిమెల్లిగా ముందుకు సాగుతున్నాడు వికసించి, ప్రకాశిస్తూ ఆకర్షిస్తున్న ఆ గులాబీలని చూస్తూ మంత్రముగ్ధుడిలా ముందుకు సాగుతున్నాడు. పట్టుచీరెల గరగరలు గాని, గుప్పుమంటున్న సెంటువాసనలు గాని, పూల ప్రదర్శనా నెపంతో అక్కడ ప్రదర్శితమౌతున్న సిరిసంపదల గొడవ గాని, వాడికేం పట్టటంలేదు. పడగవిప్పిన్న తాచుల్లా గాలికి కదుల్తూ పిలుస్తున్నట్లున్న ఆ పూలనే వాడు చూస్తున్నాడు. వాడికి విపరీతంగా ఆశ్చర్యం, ఆనందం కల్గిన చోట రెండు క్షణాలు ఆగుతున్నాడు. అటు తర్వాత మళ్ళీ కదిలి ముందుకెడుతున్నాడు. ఆ విధంగా వాడు చివరికంటా వచ్చేవరికి వాడిలో ఏదో చెప్పలేని ఆనందం, అనూహ్యమైన అనుభూతి చోటు చేసుకున్నాయ్. 'అబ్బ ఎంత బావున్నాయ్ పూలు' అని అనుకున్నాడు. ఆ వరుసలో చివరగా వున్న కుండీ ముందు అచేతనంగా నిలబడ్డాడు. కుడిచేతి రెండు వేళ్ళు నోట్లో వేసుకుని అమాయకంగా, తదేకంగా ఆ పూలవైపే చూస్తున్నాడు.

అది పచ్చటి గులాబీ అర చెయ్యి ప్రమాణంలో పూర్తిగా వికసించి పసుపు పట్టించిన ముత్తయిదువ మొహంలా పవిత్రంగా, పుష్పవతి అయిన కన్యలా అందంగా, ముద్దులు గొల్పుతూ వుంది. అదే చెట్టుకి అటు వంటివే మరో మూడు పూలున్నాయ్. ఇప్పటివరకు వాడు చూసిన మిగతా చెట్లకి ఒకటి రెండు పూలు మాత్రమే వుండటం చేతను, అవి గూడా ప్రమాణంలో చిన్నవిగా వుండటం వల్లను ఇప్పుడు వాడు చూస్తున్న పచ్చ గులాబీ వాడినెంతో ఆకర్షించింది. నాలుగు విరిసిన పూలతో ఆ చెట్టు నాలుగు చేతుల దేముడిలా నిండుగా, పవిత్రంగా వుంది.

నీలయ్యగాడు ఒక్క అడుగు ముందు కెళ్ళి ఆ పూలని చూస్తున్నాడు. అప్పటికీ వాడిని ఎవ్వరూ పట్టించుకోలేదు. అలా ఆలోచిస్తున్న వాడి బుర్రలో మనిషి సహజమైన స్వార్థపు నల్లటి ఆలోచన జరజరమని కదిలింది. ఆ నల్లటి ఆలోచనని అభం శుభం ఎరుగని పసితనం బలపర్చింది.

నీలయ్య అటూ ఇటూ చూసేడు. ఎవ్వరూ తనని గమనించటం లేదని అనుకుని జరిగి మరి కాస్త ముందుకొచ్చాడు. ఆ చెట్టుకున్న నాలుగు పూలలో ఒకటి కాస్త క్రిందికి వ్రాలి అందుబాటులో వుంది. ఆ విధంగా అటూ ఇటూ చూసిన నీలయ్యగాడి చెయ్యి చివాలున ముందుకొచ్చి ఆ పూవుని పుటుక్కున త్రుంపింది.

అలా సొంతం చేసుకున్న పూవుని వాడు సొంతం చూసుకోనైనా లేకముందే వెనుకనించి ఒక బలమైన చెయ్యి వాడి మెడ నరాలు అదిరేటట్లు గట్టిగా ఒక చరుపు చరచటము, వాడు తూలి వెళ్ళి ఎదురుగా వున్న బల్లపైన పడటం జరిగింది. ఈ ఆకస్మిక చర్య వల్ల వాడి నుదుటి భాగాన, పెదవికి బలమైన దెబ్బలు తగిలాయి. వాడు ఆ పువ్వుని ప్రాణంలా అరచేతిలో బిగించి భయంగా వెనక్కి తిరిగిచూసేడు.

ఆ వ్యక్తి వాళ్ళ కార్యవర్గపు సభ్యుడు కావచ్చు. నల్లగా, లావుగా ప్రపంచంలోని పాపంలా, అరాచకంలా భయం పుట్టించేలా వున్నాడు.

"ఏరా — దొంగచచ్చినాడా పువ్వెందుకు కోసావురా — అయినా లోపలికెలా వచ్చేవు" అంటూ క్రింద పడ్డ వాడిని చొక్కాపట్టి లేవనెత్తుతూ ప్రశ్నించాడు.

నీలయ్యగాడికి దెబ్బ చేత నుదుటిపైని బొప్పికట్టి తల భారంగా అన్పించింది. పెదవి చిట్లి సన్నగా నెత్తురు ప్రవహిస్తోంది. కాని వాడు వాటికేమాత్రం లక్ష్య పెట్టక, ఆ పూవుని అలాగే పట్టుకుని అతడి వంక భయంభయంగా చూస్తున్నాడు.

చుట్టూ నిల్చున్న జనం నీలయ్యగాడిని, ఆ వ్యక్తిని మార్చి మార్చి విచిత్రంగా, విడ్డూరంగా చూస్తున్నారు.

అంతట్లో అటుగా వచ్చిన కిషన్‌రావు అంతా గమనించి "ఏమైంది ఏమైంది" అనుకుంటూ జనాన్ని తప్పుకుని ముందుకొచ్చాడు.

నీలయ్య అలాగే నిలబడి భయంతో కదిలిపోతున్నాడు,. ఆ వ్యక్తి చెప్పినదంతా విన్న కిషన్‌రావ్ నీలయ్యగాడిని మింగేసేలా చూసి చటుక్కున వాడి చొక్కా పుచ్చుకుని బరబరా బయటకీడ్చుకెడుతూ అక్కడి జనంతో 'అంతరాయానికి మన్నించ' డని ఇంగ్లీషులో వేడుకుని వెళ్ళాడు.

నీలయ్యగాడిని షామియానాలకి దూరంగా లాకెళ్ళాడు కిషన్‌రావు. అటు తర్వాత 'ఆ పువ్వునెందుకు కోసేవురా లంజకొడుకా' అంటూ అసహ్యమైన భాషలో తిడుతూ వాడి రెండు లేత చెంపలని వాయించేడు.

నీలయ్యగాడు ధైర్యాన్ని కళ్ళలోను, ఏడుపుని బిగించిన లేతపెదవుల వెనుక దాచి ఎర్రబడ్డ కళ్ళతో దైన్యంగా, దీనంగా అతడి వంక చూస్తున్నాడు. ఎంతగా కొట్టినా నీలయ్యగాడు ఏడ్వకపోవటం కిషన్‌రావుకే ఆశ్చర్యమనిపించింది. అరచేత చటుక్కున వాడి చేతిలో వున్న ఆ పచ్చటి గులాబీని లాక్కుని 'మళ్ళీ ఈ ప్రాంతాల్లో కన్పించావంటే ప్రాణాలు తోడేస్తా — ఫో" అని కసిరాడు.

నీలయ్యగాడిలో కంగారు భయం అధికం అయినాయ్ — ఎవరో తన ప్రాణాలు లాగేసినట్టు అనిపించి 'ఆ పువ్వు నా కొగ్గెయ్ — నీ కాలట్టుకుంటా , అయ్యా అయ్యా' అంటూ బ్రతిమాలసాగేడు.

'మళ్ళీ మాట్లాడితే చంపెయ్యగలను. వెళ్ళు వెళ్ళు మడ్డి వెధవా—' అంటూ వెళ్ళబోయిన అతడి మెదడులో చక్కటి ఆలోచన తళుక్కుమంది.

కిషన్‌రావ్ ఆగి నీలయ్యగాడిని చూసి 'ఏరా ఈ గులాబీ పువ్వు కావాలా?'

నీలయ్యగాడిలో ఆగిపోతున్న ఆశ మళ్ళీ తలెత్తగా, అవునన్నట్లు తలూపాడు.

'అయితే ఓ పన్జేస్తావా?'

ఏం చెయ్యాలన్నట్టు చూసేడు. ఆ చూపులో ఆ పువ్వు కోసం ఏమైనా చేస్తానన్న తెగింపుంది.

కిషన్‌రావు సుతారంగా చేతిలో వున్న గులాబీ రేకులని సరిచేస్తూ 'ఇదిగో చూడు— అక్కడ కన్పించే ఆ షామియానాలో వాళ్ళుతాగేసిన ఆ టీకప్పులన్నీతెచ్చి, ఆమూలనున్న కుళాయి దగ్గిర కడిగి, అక్కడ టేబిలు పైని వరుసగా బోర్లించు. తర్వాత అక్కడ క్రిందబడ్డ కాగితాలు, సిగరెట్ పీకలు ఒక్కటి కూడా మిగల్చకుండా ఏరిపారెయ్యి. అప్పుడు నీకీపూవు నిస్తాను' అన్నాడు.

అంతే ఆ మాట పూర్తి కాకముందే నీలయ్యగాడు బాణంలా అక్కడి ఎంగిలి టీకప్పులవైపు పరిగెత్తాడు.

అది చూసి కిషన్‌రావు ముసిముసిగా నవ్వుకున్నాడు.

అంతలో హేమసుందరి వచ్చింది. పడవలాంటి విదేశీ కారులో, వేలు ఖరీదు చేసే పట్టుచీరెలో, గుప్పుమంటున్న విదేశీ సెంటు వాసనతో వచ్చేసింది. కాని ఆమె ఒంటరిగా రాలేదు— ఆమె వెనుకనే ఒక కుర్రాడు గూడా దిగేడు.



స్పీడు


"ఏం డ్రయివర్‌వి? ఇంత మెల్లగానా బస్ నడిపించేది?" ఆయాసంగా చెప్పింది కోపంగా దిగుతున్న ఆ భారీకాయం.

"ఇక ఇప్పుడు స్పీడ్ అందుకుంటుంది" నవ్వుతూ జవాబుగా చెప్పాడు.

—ఆర్.దమయంతి

(సికిందరాబాద్)

లేదు





## అలవాటు

“టైపురైటర్ బెల్ రింగయినప్పుడల్లా మీ టైపిస్ట్ ఎందుకలా ఫోన్‌లో ‘హలో’ అంటుంది?” అడిగాడు అర్థంకాక.

“ఇంతకుముందు ఆవిడ హోటల్లో రిసెప్షనిస్ట్‌లే” చెప్పాడు.

—ఆర్.దమయంతి

(సికిందరాబాద్)

అతడికి నీలయ్యగాడి వయస్సే ఉంటుంది. ఎర్రటి జుట్టుని అందంగా కత్తిరించేరు. నల్లప్యాంటు అదేరంగు చిన్నకోటు, నెక్‌టైతోను, కాళ్ళకి తళతళమని మెరుస్తున్న బూట్లు... చిన్ని పెదవులు, పొంగిన మొహం, ఆ మొహంలో ధీమా గర్వం... యూరోపియన్ కుర్రవాడిలా వున్నాడు.

కిషన్‌రావు దాదాపు పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆమెని సాదరంగా ఆహ్వానించాడు. ఆమె వొయ్యారంగా నడుస్తూ మైకు వద్దకు తీసుకురాబడింది. ఆమెనంటి పెట్టుకుని ఆ పిల్లవాడు... కెమేరాలు క్లిక్ మన్నాయ్. ఆమెని కూర్చోపెట్టి, నిలువెత్తుపూలదండని ఆమెకి సమర్పించాడు, చప్పట్లు మార్మోగాయ్, అంతకు మునుపు నీలయ్యగాడి చేతిలోంచి లాగేసుకున్న ఆ ముద్ద గులాబీని కిషన్‌రావు ఆ పిల్లవాడి కోటుకి అందంగా బిగించి అతడిని ఒక్కసారి చేతులపైని పైకెత్తి అక్కడున్న సభ్యులకి చూపించేడు.

మళ్ళీ చప్పట్లు!

హేమసుందరి ఆ పిల్లవాడితో ‘కీర్తి — థాంక్స్ చెప్పమ్మా’— అంది ‘అంకుల్, థాంక్స్’ అన్నాడతను స్వచ్ఛమైన ఇంగ్లీషులో.

అటుతర్వాత కిషన్‌రావ్ మైకునందుకుని హేమసుందరీ స్తోత్రం పారాయణం చెయ్యటం మొదలు పెట్టేడు. ‘కుమారి హేమసుందరి గురించి పెద్దగా చెప్పాల్సిన పన్లేదు— అయినా ఆమె గురించి చెప్పేముందు ఆమె తండ్రిగారు, మనకత్యంత ఆత్మీయులయిన శ్యామలరావు గారి గురించి కూడా చెప్పాలి...’

కిషన్‌రావు ఆ విధంగా శ్రీమంతుడు శ్యామలరావ్ గుణగణాలని వర్ణించి చెపుతుండగా, అక్కడ నీలయ్యగాడు తనకి పురమాయించిన పన్లో తలమునకలుగా వున్నాడు.

అందరు త్రాగి వదిలిన టీ కప్పుల్ని ఒకచోటికి చేర్చాడు. కుళాయి ఆ ప్రదేశానికి చాలా దూరంగా వుంది. అందుచేత వాడు చిన్న పరుగులతో ఆ ఎంగిలి టీ కప్పులని ఆ కుళాయి దగ్గిరకి కాసిని కాసిని చొప్పున చేరవేస్తున్నాడు. ప్రొద్దుటినించి తిండిలేక పోవడంవల్ల వాడికి నీరసం అన్పించింది. చిన్నగా ఆయాసంతో రొప్పుతున్నాడు. అయినా చకచకా కత్తిలా దూసుకుపోతూ పని పూర్తిచేస్తున్నాడు. వాడి వుద్దేశ్యమల్లా త్వరగా పనిపూర్తి చేసి, అతడిస్తానన్న ఆ పూవుని చేజిక్కించుకుని ప్రపంచంలో పడాలని.

కిషన్‌రావు తన వుపన్యాసాన్ని పూర్తిచేసి, చివరగా ‘....అంతటి గొప్పవ్యక్తి హేమసుందరి ఈ రోజు మన మధ్యకి రావటం మన సొసైటీ, మనం కూడా ఎంతో అదృష్టం చేసుకున్నాం— ఇపుడుకుమారి హేమసుందరిని ‘బెస్ట్ రోజ్’ని ఎన్నిక చెయ్యమని మీ అందరి తరఫున ఆమెని ప్రార్థిస్తున్నాను’— అన్నాడు.

మళ్ళీ చప్పట్లు

హేమసుందరి సుతారంగా లేచి నిలబడి అక్కడ షామియానా వైపుగా కదిలింది. ఆమె వెంటే ఆ పిల్లాడు, ఆవెనుక కిషన్‌రావ్, ఆపైన మిగతా జనం గుంపులు గుంపులుగా.

ఆమె షామియానాలోనికి ప్రవేశించి అక్కడి పూలవంక నిశితంగా పరీక్షగా చూడ సాగింది. ఆమె వెనుకవున్న జనం ఆమె చీరవంక, ఆమె నగలవంక ఆశ్చర్యంగా, అసూయగా చూస్తున్నారు. ఆమె శరీరంపై నించి వస్తున్న అత్తరువాసన ముందు మిగతా జనం వాడిన సెంటువాసన ఇప్పసారా కంపులా అసహ్యంగా వుంది.

ఆమె చకచకా కదిలి ముందుకెడుతోంది. కొన్నిచోట్ల కొద్ది క్షణాలు ఆగి చూస్తోంది. ఆ చెట్లకున్న అట్టముక్కని చదివి తలాడిస్తోంది. మళ్ళీనడుస్తోంది. ఆమె వెంటే ఆ కుర్రాడు.

ఆమె ఆ విధంగా అన్నిటిని పరీక్షించి అక్కడి చివరి కుండీవద్దకొచ్చింది. అది నీలయ్యగాడు చూసి ముచ్చటపడ్డ గులాబీ, ఆమె ఆ పూల వంక కొద్ది క్షణాలు తదేకంగా చూసి దానికున్న కార్డుచదవటంలో లీనమైవుండగా—

ఆమె వెంటవున్న ఆ పిల్లాడు చటుక్కున ఒక్క అడుగు ముందుకేసి నిస్సందేహంగా ఆ చెట్టుకున్న పువ్వుని పుటుక్కున తుంపి చేజిక్కించుకున్నాడు. అది మొదటగా చూసింది కిషన్‌రావ్. అయినా అతడేం మాట్లాడలేదు. హేమసుందరి అతడు చేసిన పనివి గుర్తించి ‘కీర్తీ యూ వాటీబాయ్ తప్పకదూ’ అంటూ మందలించబోయింది. ఆమె మాటల ధోరణిలో మందలింపు కన్నా గొప్ప, గర్వం ధ్వనించినాయ్.

కిషన్‌రావ్ నమ్రతగా ‘ఏం పర్లేదుమేడం— పసిపిల్లాడు అతడికేం తెల్సును?’ అంటూ సర్దిచెప్పేడు. హేమసుందరి ముసి ముసిగా నవ్వుతూ ‘మా కీర్తికి నచ్చిన పువ్వే నాకూ ఇష్టం, అంచేత ఈ గులాబీని ‘బెస్ట్ రోజ్’గా ఎన్నిక చేస్తున్నా’ నంది.

మళ్ళీ చప్పట్లు.

నీలయ్య కప్పులన్నిటిని శుభ్రంగా తెల్లగా కడిగి మళ్ళీ వాటి నన్నిటిని కొన్నికొన్నిగా తెచ్చి అక్కడ టేబిలుమీద వరుసగా బోర్లించేడు. అటు తర్వాత ఆ ప్రదేశ మంతా మతిస్థిమితం లేనివాడిలా తిరుగుతూ కన్పించిన ప్రతి కాగితాన్ని, సిగరెట్ పీకల్ని ఏరి దూరంగా పారేస్తూ ఆత్రంగా చప్పట్లు విన్పిస్తున్న వైపుగా చూస్తున్నాడు. కాస్సేపటికి జనం గుంపులు గుంపులుగా షామియానాలోంచి బయటికొస్తున్నారు. అపుడు వాడికో దృశ్యం కన్పించింది. ఆ జనం మధ్యలో ఒక అందమైన ఆడమనిషి, ఆమె ప్రక్కన ఒక పిల్లవాడు, వాడి చేతుల్లో తన గులాబీపువ్వు, అటువంటిదే మరొకటి వాడి కోటు గుండెలపైని....

నీలయ్య వెంటనే సర్రున కదిలి బాణంలా దూసుకెళ్ళి ఆ పిల్లవాడి ముందునిలబడి. చటుక్కున ధైర్యంగా అతగాడి చేతిలోనున్న తన పచ్చగులాబీని లాక్కుంటూ ‘ఇది నాది — ఎత్తుకెళ్ళి పోతున్నావా దొంగనా కొడకా’ అన్నాడు.

కిషన్‌రావ్ వాడిని, వాడి భాషని, చేసిన పనిని చూసి గతుక్కుమన్నాడు. హేమసుందరి వాడివంక అసహ్యంగా, జుగుప్సగా చూసింది. కీర్తి ఇంగ్లీషులో ‘మై రోజ్— అంటీ మై ఫ్లవర్’ అంటున్నాడు.

కిషన్‌రావ్ ఒక్కక్షణంలో పరిస్థితి నవగాహన చేసుకున్నవాడై వెంటనే నీలయ్యగాడి చేతిలోని పువ్వుని ఒక్క గుంజుతో లాక్కుని కీర్తి చేతిలోవుంచటం, తర్వాత నీలయ్య గాడిని బలంగా అవతలికి నెట్టివెయ్యటము, వాడు పెద్దగా, రొదగా, అసహ్యంగా ఏడ్పులంకించుకోవటమూ జరిగింది.

హేమసుందరి ‘హూ ఈజ్ హి’అనడిగింది కోయిలకంఠంతో. కిషన్‌రావ్ ‘ముష్టి వెధవ — ఎ బెగ్గర్ బోయ్ దట్సాల్’ అన్నాడు. ఆమె కదిలింది. ఆమె వెంట జనసమూహం మొత్తం కదిలింది.

నీలయ్య దెబ్బలు తాకినపుడు ఏడ్వని వాడు విచిత్రంగా పెద్దగా, వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు, దెబ్బతిన్న పక్షిలాగా, దగా పడ్డ తమ్ముడిలా, ఏమీ చెయ్యలేనివాడిలా...

అలా ఏడుస్తున్నవాడి నోదార్చటానికి అక్కడెవ్వరూ ముందుకి రాలేదు. అవును మరి వాళ్ళంతా శ్రీమంతులేగాని శ్రీశ్రీ లు కారుగా! *

## ఆవిడ

